
ఈ వారం కథ

# గుర్తు

## - వివినమూర్తి



లేచి కూర్చున్నాడు విశ్వం.

కూర్చుంటుంటే నులకమంచంపట్టిమీద నులక నగ్నంగా వున్న తొడకి ఒరుసుకుని చిన్నగా మంటపెడుతోంది.

అంతా అలుక్కుపోయినట్టుంది.

పైనున్న పెంకుల మధ్య నుంచి తప్పించుకుని జారుతున్న వెలుతురు రేఖ కళ్ళను ఆకర్షిస్తోంది.

అలుక్కుపోయినవాటిలోంచి ఏవో స్పష్టాస్పష్టాలు.

గదిలో ముక్కకంపు.

కాలు నేలని తాకగానే చల్లదనం.

"నేనెవరిని?"

ఆ ప్రశ్న విశ్వం మెదడులో నాగలికర్రులా జొరబడింది.

మెదడంతా విడిపోతోంది.

జ్ఞాపకాల చినుకులు పదును పెంచుతున్నాయి.

చిన్నారి లేత మొక్క ఒకటి జవాబుగా మొలకెత్తింది.

"నువ్వు విశ్వానివి-"

మొక్క నుంచి కొమ్మలూ, రెమ్మలూ, పూలూ, ఫలాలూ, వాసనలూ పుట్టుకునివచ్చినట్లు ప్రశ్నలూ, జవాబులూ...

"విశ్వమంటే?"

"ఒక పేరు-"

"దేనికి?"

"ఈ దేహానికి"

"ఈ దేహానికి మాత్రమేనా?"

"ఈ శరీరం చూసేదానికి కూడా... చూడగలిగేదానికి కూడా... చూడగలనని అనుకునేదానికి కూడా..."

"ఈ శరీరాన్ని ఆఘరించుకున్నదేమిటి?"

"ఈ శరీరం పుట్టినప్పటినుంచి ఇది విని, చూసి, సంపాదించుకుని, దాచుకుని, వినియోగించుకునే సమాచారం..."

"ఆ సమాచారం ప్రకారం - నువ్వెవరు?"

"... తొంభై ఏళ్ళ ముదుసలి అన్నపూర్ణమ్మ కొడుకుని - చనిపోయిన రామలింగయ్యా, ఆవిడా సంఘం అనుమతితో పెళ్ళాడి, కలిసి బ్రతికినట్లు కనిపించినందువల్ల - నువ్వు రామలింగయ్యకి న్యాయబద్ధమైన సంతానానివి- "

"న్యాయబద్ధమంటే-?"

"ఆస్తి. ఆస్తికి వారసత్వం-"

"ఆస్తి అంటే-?"

"భూమి - పశువులు - యిల్లు - గిన్నెలూ - ముంతలూ - మంచాలూ - కంచాలూ"

"అంతమాత్రమేనా?"

"భావాలు - పిత్రార్జిత భావాలూ - స్వార్జిత భావాలూ-".

"ఏవి పిత్రార్జితం? ఏవి స్వార్జితం?"

"మట్టిపై మక్కువ పిత్రార్జితం - మట్టిపై హక్కు స్వార్జితం - మట్టి చేసే సృష్టికి పరవశించడం పిత్రార్జితం - మట్టిని అమ్ముకోటం, అర్చుకోటం - స్వార్జితం-"

"నీకు నీ ఆస్తి దక్కిందా?"

"కొంత దక్కింది - కొంత దక్కలేదు-"

"ఎందువల్ల?"

"నేను విశ్వాన్ని కావడం వల్ల దక్కింది దక్కింది. నేను వెర్రి విస్సిగాడిని కావటం వల్ల దక్కనిది దక్కలేదు-"

"దక్కినదేమిటి? దక్కనిదేమిటి?"

"దక్కింది - జంధ్యం! దక్కనిది - భూమి, పశువులు, యిల్లు -"

"దక్కినదానికి ఆనందించి - దక్కనిదానికి విచారిస్తున్నావు -"

" - - - "

"ఒప్పుకో - విశ్వం!"

"కాదనుకుంటాను - "

"మరేంటి?".

"ఆలోచన... ఆలోచన... ఆలోచన... పుట్టిన దగ్గర్నుంచి యిన్నేళ్ళు లేకుండా పోయిన ఆలోచన... యీ రాత్రివేళ నా మీదకి ఉరికింది. ఆదిమధ్యాంతరహితమైన పెనుచీకటి ఒక్క తృటిలో లయమైపోయి - ఆదిమధ్యాంతరహితమైన వెలుతురు సముద్రంలో తేలుతున్నాను. ఇన్నేళ్ళ చీకటిలో నాకు దొరికిన ఒకటే, ఆరా ఆధారాల ఆధారంతో ఈ వెలుతురు సముద్రంలో విహరిస్తున్నాను. స్థలకాలాలకు పరిమితమైన బాంధవ్యాలనూ, బాంధవ్యాలకు పరిమితమైన సుఖదుఃఖోద్వేగాలనూ, సుఖదుఃఖోద్వేగాలకు పరిమితమైన ఆలోచనలనూ - స్పష్టాస్పష్టంగా చూడగలుగుతున్నాను. ఈ వెలుతురు మహా సముద్రంలో ఒకే ఒక్కదాని కోసం వెదుక్కుంటున్నాను-"

"ఏమిటది విశ్వం-"

"శేషజీవిత కర్తవ్యం-"

"ఏమిటది - దొరికిందా?"

"ప్రస్తుతానికి - ఆస్తి. నా ఆస్తిని నేను దఖలుపరచుకుంటాను"

"ఏమి తిన్నా అరగని అరవై ఆరేళ్ళ శరీరం నీది. సరిగ్గా వినబడని చెవులు నీవి. సరిగ్గా కనబడని కనులు నీవి. ఏం అనుభవించగలవని - నీకు ఆస్తి కావాలి విశ్వం?"

" - - - "

"చెప్పు - విశ్వం!"

"నాకు వారసుడిని కొనుక్కోటానికి - నాకు తలకొరివి పెట్టటానికి - నన్ను పున్నామ నరకం నించి తప్పించటానికి - నాకు వారసుడు కావాలి '-"



"వెర్రివాడా!"

"– ఇన్నాళ్ళూ అంతో ఇంతో ఆదరించిన కూతురు తన కళ్ళముందే వెళ్ళిపోతే – ఆదరించినా, మానినా నవమాసాలూ మోసి, కని, పెంచిన పెద్దకొడుకు కూడా మట్టిలో కలసిపోతే – ఆ కొడుకు బిడ్డలూ, భార్యా పట్టెడన్నం పెట్టటానికి పదేపదే విసుక్కుంటూంటే – ఎందుకు బతుకుతున్నదో అర్థంకాని నా కన్నతల్లి అన్నపూర్ణమ్మను చివరి రోజులలోనయినా సుఖపెట్టటానికయినా – నేను ఆస్తిని నా స్వంతం చేసుకుంటాను–"

ఫక్కున నవ్వు. పకాలున నవ్వు.

నవ్వు. నవ్వు. నవ్వు.

xxx

"ఏమిట్రా విస్సిగా ఆ నవ్వూ?" ముసలావిడ ప్రశ్న.

విశ్వం జవాబు యివ్వలేదు.

"ఒక్కమారు యిలా రారా చచ్చినాడా – వాకిట్లోకి తీసుకెళ్ళు –"

విశ్వం లేచి నుంచుని, మంచం మీద పంచె కోసం వెదికాడు. చిరిగిపోయిన పంచెలు. తను చించేసిన పంచెలు. వాటినే ఒకదాని మీద ఒకటి వేసి పక్క తయారుచేస్తుంది తల్లి. తనలో మిగిలిన ఓపికనంతటినీ తన బిడ్డ శరీరానికి కాస్తంత సౌకర్యం చేకూర్చటం కోసం వినియోగిస్తుంది ఆ ప్రాణి.

మరీ చిరగని పంచెను కట్టుకున్నాడు.

ఏం దాచుకుందుకి కట్టుకున్నాను–? మళ్ళీ నవ్వు నవ్వు.

"దిక్కుమాలినాడా – ఏంట్రా ఆ నవ్వూ – యిక్కడ నేను చస్తూంటే –" అమ్మ పిలుపు.

వెళ్ళాడు. రెక్క పట్టుకుని మెల్లిగా ఆ కుక్కి మంచంలోంచి లేవదీసాడు. నించోబెట్టి, వాకిట్లోకి నడిపిస్తున్నాడు. చీకట్లో మంచం గమనించలేదు – మోకాలిచిప్పకి తగిలింది.

"అమ్మా – " నొప్పితో అరిచాడు.

"ఏమయిందిరా – తండ్రీ!" ఆదుర్దాగా అడిగింది.

"మంచం – తగిలింది – "

"అయ్యయ్యో – బుద్దిదీపం ఆరిపోయిందా?"

"కలెంటు దీపం – రేపు – రేవు –"

"తిండే పెట్టని నీ వదిన – కరెంటు దీపం పెట్టిస్తుందా – పెట్టించదు"

"ఆస్తి – ఆస్తి – భూమి–" అన్నాడు విశ్వం. పైకి సరిగ్గా రావడంలేదు మాట. గొణుగుతున్నట్లు – మునుపటిలాగే – వస్తోంది మాట.

"ఏమిట్రా అంటున్నావూ–?" అంది తల్లి.

విశ్వం నవ్వు.

"వెర్రి పీనుగా – ఇక్కడ కూర్చోబెట్టి, అటు తిరిగి, నించో –"

వెన్నెల విరగకాస్తోంది.

ఆకాశంలో ఒకటీ, అరా చుక్కలు. దూరంగా కొండల వరస.

ఎక్కడో ఊళ్ళో నుంచి చెక్కభజనలు.

దగ్గరగా ఉన్న కొబ్బరిచెట్టు సమస్త విశ్వంలోనూ పెద్దదిగా కనిపించుతోంది. దానికి దూరంగా వున్న ఎన్నెన్నో చెట్లు, కొండలు, సముద్రాలూ, గోళాలు, నక్షత్రాల ముందు యీ కొబ్బరిచెట్టు ఎంతటిది?

అది కొబ్బరి చెట్టు దోషం కాదు.

"– కనిపించే ఆస్తి పెద్దది – అది అన్నింటికీ పరిష్కారం–"

విశ్వం మళ్ళీ బిగ్గరగా నవ్వాడు.

"ఏమిట్రా – ఈ రోజు మరీ పిచ్చెక్కువయిందీ – అలా నవ్వుతున్నావూ" అంటూ ఆమె ఆవేశంగా లేవబోతూ పడింది. విశ్వం ఆమెని పట్టుకుని, వీలయినంత శుభ్రం చేసి, తీసుకువచ్చి మంచం మీద పడుకోబెట్టాడు –

"మంచాలు – మంచాలు – కొనాలి –"

మళ్ళీ మళ్ళీ నవ్వు.

"పడుకోరా పీనుగా – " అమ్మ తిడుతూనే, గొణుగుడులోకీ, దాన్లోనించి మూలుగులోకీ, దాన్లోంచి నిద్రలోకీ మెల్లగా జారింది.

xxx

"అత్తి – అత్తి –" అన్నాడు విశ్వం.

ధనలక్ష్మి పెదిమలు బిగించి, కళ్ళు పెద్దవి చేసి చూసింది.

"ఏంటంటున్నావూ?" అంది సాగదీస్తూ. ఆమె అందమైన పెదాలు వికృతంగా కదిలాయి. ఆమె బారయిన జుత్తు కలేసుకున్న నాగుబాము పిల్లలు కదలాడుతున్నట్టు విశ్వానికి కనిపించింది. ధనానికి కుక్కలంటే యిష్టం. మనుషులు అంటే అసహ్యం. కుక్కలు ధనానికి కాపలా కాస్తాయి. మనుషులు ధనాన్ని ఎత్తుకుపోతారని ఆమె నమ్మకం.

"నా భూమి – కోరుటు – కోర్టు –" అన్నాడు విశ్వం కోపంగా.

అతనికి ధనం మీద కోపంగా వుంది. అంత కన్నా విశ్వం మీద కోపంగా వుంది. సెంజీకటి కవతల నుంచి తను వెలుతురు వెల్లువలోకి వచ్చాడు. తనకి ఆలోచన వచ్చింది. అయినా దాన్ని వ్యక్తంచేసే మాటలు రాలేదు. పెదవి విరుపుతో, గొంతు మార్పుతో, కళ్ల కదలికలతో – పలికిన పదాలకు వాడుకలో లేని భావాలు అద్దగల సత్తువ – మనిషికి వుంది. అదీ తనకు తెలుసు. అయినా తన వద్ద పదాలే లేవు – ఆ సత్తువ యింకెక్కడ నుంచి వస్తుంది?

"– పిచ్చిముండాకొడకా – నీకు తిండే దండగ – నువు బతకటం భూమికి బరువు – ఆస్తి కావల్సె

స్తందిరా నీకూ? ఏంచేసుకుంటావ్? పెళ్ళాడతావా – ఊరేగుతావా?"

ధనానికున్న ధనం పదాలు. అవి కూడా ధనానికి బానిసలే! పోచలు పెనవేసుకుని మోకులయినట్లు, పదాలు పెనవేసుకుని ధనానికి వాక్యాలవుతాయి. ఎంతో అందమైన ధనం ఆంగిక, వాచికాభిన యాలతో చేరి ఆ వాక్యాలు ఎదుటివాళ్ళకు ఉరితాళ్ళవుతాయి.

ధనం మీదమీదకి వస్తూ వుంటే, విశ్వం కూడా ముందుకు కదిలి ఆమెను నెట్టేసాడు –

అంతే!

ధనం పెడబొబ్బ పెట్టింది. ఆ బొబ్బకి కాంద్ర కోట మాకాలమ్మో, పెద్దాపురం మరిడమ్మా జడుసుకున్నారు. ఒక్క ఊపున పచ్చడిబండ అందుకుని, రెండు చేతుల్తో ఎత్తి నర్రున వెనక్కి తిరిగింది. తన వెనక జరిగిన దానిని విశ్వం గ్రహించాడు. ఆమె వేపు తిరుగుతూనే ఆ పచ్చడిబండను ఆమె చేతుల్లోంచి లాగేసాడు. పళ్ళు పటపట కొరుకుతూ ఆమె మీదకి బండను ఎత్తాడు.

"అమ్మో – అమ్మో – నా కూతురుని చంపేస్తున్నాడమ్మో –" అంతవరకూ బొమ్మలా చూస్తూ నించున్న ధనం తల్లి నోరు విప్పింది.

బండ ఎత్తేసరికి – ధనం నోరుమూతపడింది. కరచరణాలు కదలలేదు. తల్లి అరుపులు కూడా – విశ్వం చూపులు ఆమె వేపు తిరగగానే – ఆగిపోయాయి.

వజవజ వణుకుతున్నారు ధనమూ, ఆమె తల్లీ.

ఆ క్షణంలో –

ధనం రక్షణ కోసం మిగిలింది ఒకే ఒక్కటి.

అది విశ్వం హృదయం.

ధనానికి హృదయం అనే అంతః శత్రువు లేదు. విశ్వానికి అదే అసలు శత్రువు.

"ఛత్!" ఆ బండను దూరంగా విసిరేసి అక్కడనించి కదిలాడు. తనకూ, తల్లికీ కేటాయించిన నాలుగు గోడల మధ్యకు ప్రవేశించాడు. తల్లి ఆ కుక్కిమంచంలో పాతగుడ్డల మూటలో పాతగుడ్డలా పడి వుంది.

ఉదయం ఎనిమిది దాటింది. అమ్మకి మొహం కడిగించాడు. కాఫీ కోసమని రోజూలాగే వెళ్ళాడు. కానీ, ఆ రోజు ఉత్తి చేతుల్తో తిరిగి వచ్చాడు.

గోడ అవతల నుంచి ధనమూ, ఆమె తల్లీ శాపనార్థాలు పెడుతున్నారు. ఎన్నో ఏళ్ళుగా ఎదురెరుగని ఏలుబడికి ఆ రోజు విశ్వం నుంచి ఏర్పడిన – కేవలం పిచ్చిచేష్ట అయినప్పటికీ – అది తమ భద్రతకు ఎంత ప్రమాదమో వాళ్ళిద్దరూ అందరినీ పోగేసి చెపుతున్నారు. భద్రత విషయం వచ్చేసరికి ధనానికి సంఘం కావాలి. న్యాయం విషయం అయితే ధనానికి పెత్తనం కావాలి.

విశ్వం వింటున్నాడు.

అతను మొహాన్ని రెండు చేతుల మధ్యా వుంచుకుని, పగుళ్ళువారిన ఆ గది గచ్చులోకి చూపుల్ని దిగ్గొట్టి మంచం మీద కూర్చున్నాడు.

ఆ రోజు వాళ్ళిద్దరికీ తిండి లేదు.

పక్కగదిలో వండిన పదార్థాలలో వారికి చట్టబద్ధమైన వాటా వుంది. దాన్ని అడిగి తీసుకునే హక్కు వారికి వుంది. కదలలేని ఆ ముసిలమ్మకీ, అంతో యింతో కదలగల విశ్వానికీ దాన్ని అమలుచేయించుకునే శక్తి లేదు. ఇరుగుపొరుగులకు ఆ యింటి సార్వభౌమత్వాన్ని స్పృశించే హక్కు లేదు. ఆ యింటి ప్రాణుల ఆకలి ఆ యింటి ఆంతరంగిక వ్యవహారం మాత్రమే!

పొద్దువాలుతోంది. విశ్వం తల్లిని చూసాడు. 'చచ్చిపోయిందా?' అనుకున్నాడు.

కదిలిపోయాడు. ఒక్క అంగలో ఆ మంచాన్ని చేరాడు. లేదు – చనిపోలేదు – ప్రాణం పోలేదు – సమస్యలతో ముడివిడిపోలేదు – ఆమె చనిపోతే ఏమవుతుంది?

కుదరదు – ఆమె చనిపోరాదు.

నీళ్ళు తీసుకొచ్చి ఆమె పెదాలు తడిపాడు. ఆర్చుకుపోయిన నాలిక తడి అవుతూంటే కొడిగట్టుకుపోతూన్న దీపానికి చమురు అమరినట్లయింది.

తనూ ఓ గ్లాసుడు నీళ్ళు తాగాడు – ఇంట్లోంచి బయటకు వచ్చాడు విశ్వం.

xxx

పెద్ద వీథికి చేరే సందూ, అది గడవగానే ఎదుటపడే చెరువూ, గట్టుకి ఆనుకునివున్న గుడి, దాన్ని దాటగానే ఊరి ఉమ్మడి నుయ్యి. ఆ తర్వాత షావుకారు దుకాణం, అవి దాటుతూనే వీథికి అటూ ఇటూ యిళ్ళూ, ఊరగాలవా, వంతెనా, అవి దాటగానే గుడిసెలూ, వాటి మధ్య నుంచి రోడ్డు మధ్యకు పరుగెత్తుకువస్తూ పెద్దలచేత మందలింపబడే చందనపు బొమ్మల్లాంటి పిల్లలూ, క్రమక్రమంగా కళ్ళ ముందునించి మాయమయి– పచ్చటి వరిచేలూ, నల్లటి చెరుకు తోటలూ, చల్లటి గాలులూ, పాటుబడే వాళ్ళ గొంతులూ ఎదురవసాగాయి.

విశ్వం నడక సాగుతోంది.

ఎదురవుతున్న వాళ్ళు పలకరిస్తున్నారు. పరాచికాలు ఆడుతున్నారు. గట్టు దిగి కొందరు దోవయిస్తున్నారు. ఒకతను చెరుకుగడ ఒకటి తినమని యిచ్చాడు.

– మీరంతా తెలుస్తున్నారు. మీ మాటల్లో చేతల్లో తేడాలు తెలుస్తున్నాయి. తెలిసినదంతా తెలిసినట్టేనా? తెలియనిదంతా తెలియనట్టేనా? ఇది మాత్రం నాకు తెలియటం లేదు–

గట్టుమీద విశ్వం నడక సాగుతోంది.

వరిచేలు కోతకి వచ్చాయి. కొన్ని కోసేసారు. పనలు ఎండబెట్టారు. ఎండిన పనలు కుప్పలు వేసారు. కొన్నిచోట్ల బల్లకొట్టు కొన్నిచోట్ల కుప్పలు నూర్పు. నూర్చిన ధాన్యం కుప్పబోసి ఒకచోట దాని మీద మట్టి పరచి ముద్రలు వేస్తున్నారు.

విశ్వం ఆలా నిలబడి చూసి కదిలాడు.

చిన్నతనం నుంచి తనకు ముద్ర బల్ల అంటే యిష్టం. ముద్రబల్ల పిడిమీద వేళ్ళు బిగుసుకుంటే తరతరాల వాడికతో ఏర్పడిన నున్నదనం తనకు ఎంతో గమ్మత్తుగా ఉండేది. ఆ బల్లమీద ఆంజనేయుడి బొమ్మ ఏటి ఒడ్డున తడి యిసకలో వరసగా వేసుకుపోడం తనకు ఎంతో యిష్టం.


కాని–ఏం లాభం?

ముద్ర బల్లను తన చేతికి యిచ్చేవాడు కాదు. ఓ మారు దాన్ని రహస్యంగా పట్టుకెళ్ళి ఆడుకున్నందుకు చావగొట్టాడు అన్నయ్య.

అన్నయ్య ముద్ర బల్లను ఎందుకు వదిలేవాడు కాదో యిప్పుడు తెలుస్తోంది. ముద్రబల్ల ధాన్యం పోరుకి కాపలా. ధాన్యమంటే ఆస్తి. వేసిన ముద్ర చెదిరినందుకు అన్నయ్య పాలికాపుని తన్నటం చూసాడు. అది ఎందుకో యిప్పుడు తెలుస్తోంది.

విశ్వం నడక సాగుతోంది.

కాలవ దాటగానే తమ పొలాలు ఆరంభం. వాటి హద్దులు తనకి ఖచ్చితంగా తెలుసు. హద్దులు తన నిస్తేజ మస్తిష్కంలో గట్టిగానే నాటుకున్నాయి. ఈ హద్దులు ఎలా ఏర్పడ్డాయి?



బహుశా అవి ఏర్పడలేదు. ఏర్పర్చబడ్డాయి. మనుషులు వాటిని ఏర్పర్చారు. వాటి ఏర్పాటును అందరి చేతా అంగీకరింప చేశారు. ఆ హద్దులు దాటడం అధర్మమన్నారు. అది చట్ట వ్యతిరేక మన్నారు. అతిక్రమించితే శిక్ష అన్నారు. శిక్ష వేయటానికి ఏర్పాట్లు చేశారు.

ఆ ఏర్పాట్లలో తన భూమికి, అన్న భూమికి మధ్య హద్దు ఉండే ఉండాలి. అన్నని కన్న మనిషే తననూ కన్నాడు. తను మతిలేనివాడే అయినా, తనకు హక్కు ఉండే ఉంటుంది. తమ భూములలో తనవి వేరూ అన్నవి వేరూ అయే ఉండాలి. అవేమిటో తను తెలుసుకోవాలి. ఆ హద్దులు లేకపోతే వాటిని ఏర్పర్చాలి. తన భూములు తను స్వాధీనం చేసుకోవాలి.

దాంతో-

తనూ తల్లీ ఉండే గదిలో వాసన తగ్గుతుంది. వెలుతురు హెచ్చుతుంది. మంచాల్లూ, పరుపులూ, దుప్పట్లూ-ఒకటేమిటి-పనిమనుషులతో సహా అన్నీ వస్తాయి.

కనక-హద్దులు తెలుసుకో-వాటిని ఏర్పర్చు-పడిపుందినీ ఒప్పించు-చాలు-నువ్వేం చేసినా ఫరవాలేదు-చేయకపోయినా ఫరవాలేదు-హద్దులే హక్కులు. హద్దులే సమస్త సౌకర్యాలకు దిక్కులు.

విశ్వం గట్లమీద నడుస్తున్నాడు. సూర్యుడు పడమటి దిక్కుకి చేరుకుంటున్నాడు. ఎర్ర డాలు ఆకాశమంతటా పరచుకుంది. పెద్దగా, నిస్తేజంగా, అందంగా వున్న సూర్య బింబాన్ని గంపకెత్తుకుని మోస్తున్నట్లున్నాయి చెరుకు తోటలు. నగ్నంగా వున్న చేతుల మీద చెరుకు పీకలు గీసుకుని మంట పెడుతున్నాయి. కొంతకాలంగా నడక అలవాటు తగ్గింది. తరచు విరేచనాలతో ఓపిక తగ్గింది. పిక్కలు నొప్పిగా ఉన్నాయి. ఆకలికి కడుపు అలవాటు పడినా శరీరం తూలుతోంది.

విశ్వానికి తన పాత అలవాటు గుర్తు వచ్చింది. దాని గురించి అందరూ వింతగా చెప్పకునే వారు-ఏ దోవలో వెళ్తే అదే దోవలో నడుచుకుంటూ వచ్చేవాడు. వెళ్ళటంలో ఎక్కడ అడుగు వేసాడో, వచ్చేటప్పుడు అక్కడే అడుగు వేసుకుంటూ వచ్చేవాడు. ఎప్పుడయినా పొరపాటున ఒక అడుగు పడకపోతే అది ఏ రాత్రో గుర్తు వచ్చేది. అంతే! ఆ రాత్రివేళ బయలుదేరిపోయేవాడు. అన్ని మైళ్ళూ నడిచి, ఆ అడుగు సరిచేసుకుని తిరిగి వచ్చేవాడు. ఒకటి రెండు రోజులు కనపడకపోయినా-ఎవరూ కంగారు పడేవారు కాదు. అడుగుల లెక్క . తప్పినట్టుంది. సరిచేసుకుని వస్తాడు అనుకునేవారు.

ఏమిటో వింత అలవాటు?

బహుశా-భూమికీ మనిషికీ మధ్య తొలి సంబంధం పాదాలే గదా? అవి వేసే అడుగులేకదా! మనిషి రెండు కాళ్ళమీద నిలబడ్డాక పోగొట్టుకున్నవి ఆ తొలి సంబంధంలో సగ భాగాన్నేగదా! మనిషికి -తన- అనే ఉనికికి తొలి గుర్తు పాదమే అడుగే. అడవిని మచ్చిక చేసుకునే క్రమంలో తొలి విధానం అడుగుజాడలు గుర్తు పట్టడమేగదా! ఆ తర్వాత తర్వాతనే కళ్ళు ఉపయోగించాడేమో!

వెలుతురు వెల్లువలో విహరిస్తున్నాడు విశ్వం.


గట్టుమీద పడవలసిన అడుగు పక్కకి పడింది. ముందుకి పడిపోయాడు. మడిలోకి దొర్లిపోయాడు. తలమీద ఏదో మెత్తినట్లయింది. దిమ్మెక్కింది. కళ్ళు మూత పడ్డాయి.

ఆ గట్టున ఎవరూ నడవరు. చీకటి పడిపోయింది. పైగా అది చెరకు మడి. విశ్వాన్ని ఎవరూ గమనించలేదు.

మెలకువ వచ్చే సరికి గాలి తిరిగింది. తూర్పు దిక్కున చంద్రుడు ఒళ్ళు విరుచుకుంటున్నాడు. హేమంతపు మబ్బులు తెల్లగా పసిబిడ్డల్లా ఆకాశంలో కేరింతలాడుతున్నాయి. గాలికి కదుల్తున్న తోటల చిరు శబ్దం, ఏదో దారి తప్పిన పిట్ట అరుపు, చెవుల ద్వారా, బెల్లం పాకాల వాసనా ఆవ చేల వాసనా మంచుకి తడుస్తున్న మట్టి వాసనా ముక్కు పుటాల ద్వారా చల్లటి గాలీ మెత్తటి మట్టి చర్మం ద్వారా, చంద్రుడు మబ్బులూ కళ్ళ ద్వారా, బాహిర ప్రపంచం శరీరాన్ని వారధి చేసుకుని అంతః ప్రపంచాన్ని ఆనందంతో నింపేస్తున్నాయి. సమస్తమూ ఒక సంపూర్ణంలా-విడదీయటానికి వీల్లేని హద్దులులేని విడి భాగాల ఐక్యంతో ఏర్పడిన అఖండంలా-ఒక బ్రహ్మానందంలా తనలోకి యిముడ్చుకుంది.

ఎంతసేపది?

ఆనంద స్వరూపం ఒక హిమ బిందువు. ఒక నీటి బుడగ. దాన్ని అనుభవాన్ని విడిచి అవగతం చేసుకోబోతే ఒక్క త్రుటిలో అంతా విడిపోతుంది. అన్నీ కనవస్తాయి. వినవస్తాయి. తెలియవస్తాయి. ఆ తర్వాత నీ ప్రయత్నం అంతా జారిన ఆ హిమ బిందువు కోసం పగిలిన ఆ నీటి బుడగ కోసం అన్వేషణ, అన్వేషణ.




విశ్వం లేచి కూర్చున్నాడు. ఒంటికి అంటిన మట్టిని చేత్తో దులపబోతే తోసెయ్యబోతే- అది చేతికి అంటింది.

ఏమిటిది? మట్టి.

ఎవరిదిది? దీనితో ఆడేవాడిది. దీనిలో జీవించే వాడిది. దీనిలో జీవాన్ని పోసేవాడిది. ఆ జీవాన్ని కంటికి రెప్పలా కాపాడుకునేవాడిది. దానితో తోటి జీవుల బొజ్జలను నింపేవాడిది. జీవితాన్ని కొనసాగించే వాడిది.

ఎవడువాడు?

వాడు విశ్వం కాదు. విశ్వం అన్న అంతకంటే కాదు. వాడు మానవుడు. వాడు పనివాడు. మట్టి పట్ల ప్రేమను పిత్రార్జితంగా పొందేవాడు.

విశ్వం లేచి నించున్నాడు.

వాడికి లేని హక్కు విశ్వానికి ఎక్కడుంది?

వాడి కోసం ఏర్పర్చిన హద్దులు విశ్వం అన్నయ్య సృష్టి. వాడి పిత్రార్జితాన్ని వాడే పొందలేనప్పుడు, విశ్వం అన్నయ్య వాడినే వంచించినపుడు, మతిలేని విశ్వాన్ని ఎందుకు వంచించలేడు? ఇంత మందికి జరిగిన వంచనముందు తనది ఏమాత్రం?

ఆస్తి ప్రదిక్షణం పూర్తిచేయకుండా విశ్వం వెనుదిరిగాడు.

కొంత దూరంలో గట్టుమీద ఎవరో ఉన్నారు. వాళ్ళు ఏదో చేస్తున్నారు. విశ్వాన్ని చూసి అందులో ఒకతను గట్టిగా అరిచాడు.

"ఆ ఎర్రాయన వస్తున్నాడోరేయ్! అగెత్తు"

ఆ గొంతు విశ్వానికి గుర్తే! ఒక్క అంగ వేసేసరికి ఆ మనిషి విశ్వం చేతికి దొరికాడు.

అతను పాలికాపు ఎంకడు. దూడల దగ్గర జీతగాడుగా చేరినవాడు. పాతిక ముప్పై ఏళ్ళుగా ఈ భూముల్లో ఒళ్ళు విరుచుకుని పెద్ద పాలికాపయాడు. ఆరడుగుల ఎత్తున, చేతిలో బడితను ఆసరా చేసుకుని ఈ హద్దులను కాపలా కాసి ఈ ఆస్తికి పెట్టని కోట అనిపించుకున్నవాడు.



# మోడల్ గాళ్ హీరోయిన్

వెంకటేష్ హీరోగా నటిస్తున్న శ్రీలక్ష్మి వేంకటేశ్వర ఆర్ట్ క్రియేషన్స్ చిత్రంలో లిరిల్ సబ్బు మోడల్ ప్రీతి ఒక హీరోయిన్‌గా ఎంపికయింది. ఈ సిని మాకు హీరోయిన్ ఎంపిక కోసం మొత్తం 50 మంది మోడల్స్‌ను పరిశీలించాక ఈ అమ్మాయిని ఎంపిక చేశాం! అన్నారు చిత్ర దర్శకుడు జయంత్. ప్రీతి అల్లరి పిల్ల. అల్లరి చేస్తూ అటూ ఇటూ తిరుగుతుం టుంది. సరిగ్గా ఈ కథలో క్యారెక్టర్‌ది ఆ అమ్మాయి మనస్తత్వమే!. అందుకే ఆమెను ఎంపిక చేశాం! అన్నారాయన. అన్నట్టు నేను పెద్ద హీరోల చిత్రాలకే దర్శకత్వం చేస్తానన్న అపోహ వుంది. వరసలా వచ్చింది అంతే! అన్నారు. స్టార్స్‌తో కొంత పెయిన్ వున్న మాట నిజమే 'పెయిన్ వున్నా అందుకు తగ్గ గెయిన్ కూడా వుంటుందన్నారు జయంత్ చమత్కారంగా.

---

చెమటను ఆ భూములకి పంచి, పేరుని మిగిలించుకున్నవాడు.

గజగజ వణుకుతున్నాడు ఎంకడు.

అరవై ఆరేళ్ళ ముదుసలి. యిన్నేళ్ళుగా వెర్రివాడు అనిపించుకున్న ఈ నిర్బలుని ఏమందు ఆ భీమ బలుడిని వణికిస్తున్న దేమిటి?

హద్దు

తన చేతి నుంచి ధనం మీద వాలబోయిన పచ్చడి బండను విసిరేయించిన దేమిటి?

హద్దు

ఆ హద్దు లోలోపల సహజంగా ఉన్నదా? పైపైన కృతకంగా ఏర్పర్చినదా?

అది లోలోపల సహజంగా ఉన్నదాన్ని మలుచుకుని మచ్చిక చేసుకుని దాని ఆధారంగా పైపైన కృతకంగా ఏర్పర్చిన దానికోసం వినియోగించుకున్నారు.

లోలోపలి హద్దులను తెగ నరుక్కున్నవారూ పైపైన హద్దులను ఏర్పర్చినవారూ లోక పాలకులయ్యారు. పైపై హద్దులను నిర్మూలించబోయినవారు నేరస్తులయ్యారు. ఎంత చిత్రం! ఎంత అన్యాయం!

"ఏం లేదండబ్బాయిగోరూ" అంటూ నోరు పెగల్చుకుని ఏదో చెప్పబోతున్నాడు ఎంకడు.

విశ్వం తన చేతిలో నలుగుతున్న మట్టిని ఆయన చేతిలో ఉంచి "యింద-యిది నీదే?" అన్నాడు.

అంటూనే అతని చేతిని వదిలేసాడు.

ఊరివేపు సాగాడు.

చేలను విభజించి నిర్మించిన ఊరి వేపు సాగాడు.

"ఎర్రాయన దేవుడు" అంటున్న ఎంకడి గొంతు వెంట బడింది.

విశ్వం నవ్వు వెన్నెలను పీల్చుకుని వెన్నెలలో కలిసిపోసాగింది.

* * *

విశ్వం యిల్లు చేరుకునేసరికి ముసిలావిడకి అన్నం పెడుతోంది కరుణ. ఎనిమిదేళ్ళ ఆ పిల్ల ధనానికి వుట్టటం సహజమా అసహజమా?

"ఇస్సి తాతా-యిస్సి తాతా-నువ్వూ అన్నం తిందువుగాని రా" అంటోంది కరుణ.

ధనం ఆలనలో పాలనలో ఈ కరుణ ఏమవుతుంది?

"స్నానం-స్నానం" అన్నాడు విశ్వం.

"ఎందుకు?"

"ఎంకడు"

"ముట్టుకున్నావేంట్రా చచ్చినాడా?" అంది ముసలమ్మ.

విశ్వానికి వీపు మీద చరిచినట్లయింది.

పెంజీకటి కవతల నుంచి వెలుతురు వెల్లువలోకి నిజంగా విసిరేయబడ్డాడా? పెంజీకటిలో పుట్టి తనని వదిలిపెట్టుండా ఉండిపోయిన దేమిటి?

## అసలైన ద్విపాత్రాభినయం

విశ్వ విఖ్యాత నట సార్వభౌమ ఎన్.టి. రామారావు నటునిగానే కాక దర్శకత్వం లోనూ ప్రతిభ గడించారు. ఆయన కుమారుడు యువరత్న బాలకృష్ణ దర్శకునిగా అరంగేట్రం వేయనుండడం ఇప్పుడు 'టాక్ ఆఫ్ ది టాలీవుడ్'గా మారింది. వచ్చే ఏప్రిల్ లేదా మే నెలల్లో 'బ్రహ్మతేజ' బ్యానర్ పై ఈ చిత్ర నిర్మాణం ప్రారంభమౌతుందని బాలకృష్ణ చెప్పారు. ఇందులో ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నారు. అయితే హీరోగా, దర్శకునిగా ఆ చిత్రంలో ఆయన నిజమైన ద్విపాత్రాభినయం చేయనున్నారన్నమాట!.

"జందెం-జంద్యం"

"జంధ్యమేమిట్రా చచ్చినాడా-తెంపి పారేసేవేంటి?"

ఎన్నిసార్లు ఆ పెంజీకటిలో జంధ్యాన్ని తెంచాడో ఎన్నిసార్లు చించాడో పంచెల్ని- ఎన్నిసార్లు విసిరేసాడో ఇంటిమీదకి-

ఎందుకలా చేసేవాడు?

యిప్పుడు అర్థమవుతోంది.

జంధ్యం-పంచె-యిల్లు-మూడూ మూడింటికి గుర్తులు తనకీ గతానికీ మధ్యగల బంధానికి గుర్తు-జంధ్యం.

తనకీ వర్తమానానికీగల లంకెకు గుర్తు-యిల్లు.

తనకీ సమాజానికీ మధ్య హద్దుకి గుర్తు-పంచె.

ఆ పెంజీకటిలో జంధ్యాన్ని తెంపేయబోయాడు-

యిల్లుని వదిలేయబోయాడు-పంచెని చింపేయబోయాడు.

గుర్తులు చెరిపేయ బోయాడు.

ఆ పెంజీకటిలో బహుశా ఆ ప్రయత్నాలు చిరుదీపాలు.

ఈ వెలుతురు వెల్లువలో-యివి యింకా ఉండటమేమిటి? ఇది వెలుతురు వెల్లువేనా?

నిజంగా అదే అయితే ఈ లంకెలు తెగాలి గదా?

ఆస్తిమీద హక్కు దఖలు పరచుకోటానికి చాలని యీ వెలుతురు-ఈ ముదుసలి తల్లి శేష జీవితాన్ని సుఖపరచాలన్న ఆలోచననేగాని, శక్తిని యివ్వని ఈ వెలుతురు-ఆ లంకెలు తెగ్గొట్టగలదా?

కరుణ ముందు చెయ్యి చాచి 'ముద్ద' అన్నాడు.

పరిషించకుండా తింటావట్రా-అందామనుకున్న తల్లి-బిడ్డకి ఆకలి వేస్తోంది గాబోలు-అన్న ఆలోచనతో నోరు మెదపలేదు.

కరుణ పెట్టిన ముద్ద ఒక్క ఉదుటను మింగేసాడు.

అన్నం ఎక్కడకు వెళ్ళింది?

శరీరంలోకి.

ఎవరీరం ఎక్కడికి వెళుతుంది?

మట్టిలోకి.

మట్టి ఎక్కడ ఉంది?

విశ్వంలో.

అంటే?

విశ్వం లోపల విశ్వం వుంది.

విశ్వంలోంచి విశ్వం పుడుతోంది.

విశ్వంలోకి విశ్వం నడుస్తోంది.

* * *

ఆ రాత్రి తిమ్మాపురం నిదుర పోతోంది. విశ్వం మంచం మీంచి లేచాడు. ఇంటి చుట్టూ తిరిగి యింటికి దణ్ణం పెట్టాడు. బయటకు వచ్చి చెరువుకి దణ్ణం పెట్టాడు. ఊరు విడిచి ఊరికి దణ్ణం పెట్టాడు.

వెన్నెల వెలుతురులో విశ్వం నడక మొదలయింది.

* * *

పెద్దాపురంలో ఒక యింటి అరుగుమీద ఆ ముదుసలి కూర్చుని వున్నాడు. ఒంటిమీద గోనె సంచీ ఒకటి గోచీ గుడ్డగా ఉంది. చేతిలో ఊతకర్ర. పెరిగిన గడ్డం.

కళ్ళనిండా వెలుతురు–

మనిషిని విడిస్తే మనిషి–ఇల్లు విడిస్తే యిల్లు–ఊరు విడిస్తే ఊరు...అతుకు విడితే అతుకు.

నీలోపలనున్నదాన్ని–తెంచి, ధ్వంసించి, వదిలించుకోడం సాధ్యమయితే కావచ్చు.

కాని బయటనున్నదాన్ని? మనిషిని, యింటిని, ఊరిని?

ఒకటి వదిలితే–మరొకటి–బట్టకి అంటుకున్న ముళ్ళ కంపలా–అతుక్కుంటోంది.

ఈ పది రోజులలో ఎన్ని అతుకులు?

దేవుడని పళ్ళూ పానీయాలూ యిచ్చారు. పిచ్చాడని పిల్లలు వెంటపడితే దేవుడని పెద్దలు వెంటబడ్డారు. తెలియని వన్నీ దేముడనుకునే మానవ ప్రవృత్తి ఎన్ని తెలిస్తే మాత్రం–మారుతుంది? జీవితం కష్టాలు పెడుతుండగా, తెలియనివి ఎదుట పడుతుండగా–మనిషి కష్టాల నుంచి బయట పడటానికి తెలియని వాటిని పట్టుకోకుండా ఎలా ఉండగలడు?

వెంటబడ్డ పెద్దలు కష్టాలు చెప్పుకున్నారు. కన్నీళ్ళు పెట్టుకున్నారు. ఉన్నది పసుపించుకున్నారు.

ఎందుకదంతా యిలా?

దేనికీ అతుక్కోనట్టు కనిపించే మనిషి చుట్టూ–బెల్లం ముక్క మీద చీమలు అతుక్కున్నట్టు మనుషుల్లు అతుక్కుంటారు.

అయితే అతుక్కోకుండా ఉండటం అసాధ్యమా? ఎందుకసాధ్యం?

ధనానికి బంధాలు ఏమున్నాయి? కనీసం తనతో లేవుగదా?

విశ్వం అస్థిమితంగా కదిలాడు.

అతనికి నీరసంగా వుంది. ఆయాసంగా వుంది.

అలాగే అరుగుమీద ఒరిగాడు.

ఇంట్లోనున్న వాళ్ళు, వీధిన పోతున్న వాళ్ళు అతని చుట్టూ చేరారు. లోపలికి తీసుకు వెళ్ళారు. చాప పరిచి పడుకోబెట్టారు. మంచినీళ్ళు నోట్లో పోసారు.

విశ్వం కళ్ళు మధ్య మధ్యలో తెరుచుకుంటున్నాయి.

ఏవో తెలియని మొహాలు–పూర్తిగా తెలిసిన ఒకే ముఖం తాలూకు వివిధ రూపాలు.

"ఎవరండీ తాతగారూ? ఏ వూరండీ మీది?" అడుగుతున్నారు. తెలుసుకోవాలనుకుంటున్నారు.

ఎవరు నేను?

నేను నీవే!

మధ్యాహ్నం అయింది.

తిండి చర్చ మొదలయింది. ఒకటి అరా చెవిన బడుతున్నాయి.

– "బాపనాయన లాగున్నాడు"

వాళ్ళు హోటలు నుంచి భోజనం తెప్పించారు.

విశ్వానికి తెలుస్తోంది.

తన జంధ్యం వల్ల వాళ్ళు తమ యింటి తిండి పెట్టడం లేదు–

విశ్వానికి నవ్వు వచ్చింది.

తను లంకెలు తెగ్గొట్టుకున్నాడు. కాని రెండు గుర్తులు ఉండిపోయాయి. ఒకటి జంధ్యం. రెండు గోచి.

శరీరం అశక్తంగా ఉంది.

చెయ్యి పట్టు తప్పతోంది.

మిగులున్న శక్తి నంతటినీ కూడగట్టుకున్నాడు– ఒక గుర్తు జంధ్యం తెగిపోయింది.

శరీరం పెంజీకటిలోకి జారిపోతోంది. మస్తిష్కం వెలుతురు వెల్లువలోకి జారిపోతూంది.

ఇంక మిగిలిన హద్దు–తనకీ సమాజానికీ మధ్య హద్దు– గోచి.

దాన్ని తెంచుకునే ప్రయత్నం అతను చెయ్యలేదు.

అన్నీ అయిపోయాయి.

తెగవలసిన లంకెలు తెగాయి. గుర్తులు రాలగాయి.

మిగిలినది ఈ శరీరం–సమాజం.

విశ్వాన్ని కప్పెట్టాలా? పూడ్చాలా? పాత విశ్వం కొత్త విశ్వానికి సమస్య.

విశ్వం నుంచి విశ్వం నుంచి విశ్వంలోకి విశ్వంలోకి–పొరలు పొరలుగా విశ్వం. కలుస్తూ విడిపోతూ విడిపోతూ కలుస్తూ విశ్వం.

విశ్వానికి నవ్వు వచ్చింది.

తెరలు తెరలుగా నవ్వు. నవ్వు నవ్వుగా నవ్వు.

ఆ నవ్వు ఎక్కిళ్ళయింది. విశ్వం విశ్వంలోకి కదిలి పోయాడు. కలిసిపోయాడు.

* * *

తిమ్మాపురం విశ్వాన్ని వెదుక్కుంటోంది.

పెద్దాపురం గోనె సంచీ గోచీని ఊత కర్రనీ చూపించింది.

"అయ్యో–అయ్యయ్యో–అతను మా విశ్వమే"

"మీ వాడే అయితే–ఎలా వదిలేసారు?"

"మా వాడంటే మావాడే కాని సార్వభౌమత్వం అంతరంగిక వ్యవహారం"

నవ్వింది గోచీగుడ్డ. నవ్వింది ఊతకర్ర.

"పట్టుకుపోండి–యీ గుర్తుల్ని"

* * *

గడచిపోయిన విశ్వాలు ఎన్ని గుర్తులు మిగల్చలేదు! ఆ గుర్తుల్లో మాత్రం ఎన్ని మిగిలాయి!

* * *

